తీసుకొని మేమిద్దరం సర్దుకొని కూర్చున్నాం.

రెండో రోజు సాయంత్రం ఆ వీధిలోంచి వస్తుండగా—గభే మరొకరి యింటిముందు ఎవరితోనో మాట్లాడుతూ నిల్చొని వున్నాడు.

మమ్మల్నిద్దర్నీ చూడగానే ఆనందంతో కేకేసి—ఆయనకు వీళ్లేనన్నట్లుగా చూపించాడు.

మొదట ఆయన మమ్మల్ని అపరిచితుల్ని చూసినట్లుగా చూసి—తరువాత త్రిప్పుకొని—'హో—వీళ్లెందుకు తెలియదు—బాగా తెల్సు—మంచికుర్రాళ్లు' అని యింగ్లీషులో చెప్పసాగాడు.

మా యిద్దరికీ అర్థంగాక వొకరి మొఖాలు వొకరు చూసుకున్నాం. గభే—మమ్మల్నిగురించి అరగంట చెప్పాడు—రాత్రిపూట మేమెంత శ్రద్ధగా చదివేది—ఎంత శ్రద్ధగా ట్యుటోరియల్స్ వ్రాసేది అన్నీ చెప్పి—చివరకు—మాకు అన్నివిధాలా సహాయం చేయవల్సిందిగా ఆయనకు మరీ మరీ చెప్పి—ఇంటివైపు నడక సాగించాడు

ఆయన—'భయపడకండి ఆయన తరహా అంతే! ఆ జబ్బు వచ్చిం దగ్గర్నుంచీ ఆయనకు జ్ఞాపకశక్తి తక్కువయిందను కుంటాను. ఆ మధ్య నెప్పుడో వచ్చి—మిమ్మల్నిగురించే అనుకుంటూ—ఏదో చాలా సేపు చెప్పాడు. నేను అన్నిటికీ తలూపాను. ఇటువంటివాళ్ల దగ్గర ఎదురుచెప్పకుండా వుండటమే—ఏమంటారు?' ఆయన నా భుజంతట్టి తనయింట్లోకి దారితీసాడు—

అక్కడ వ్రేలాడుతున్న బోర్డును అప్పుడు చూసాం—

ఆయన పేరుతోబాటు—'ప్రొఫెసర్ ఇన్ సైకాలజీ' అనివుంది. మా సబ్జక్టు 'పొలిటికల్ సైన్సు'!

* * *

మేము సెకండ్ టర్మ్ సెలవులకు యింటికిపోయిన తరువాత—కొద్దిరోజులకే—నాకో చిన్నఉత్తరం ఇంగ్లీషులో వచ్చింది. 'రామకృష్ణా—క్షేమంగా చేరావనుకుంటాను యిక్కడ మీ రెళ్లిన తరువాత మాకేం తోచటంలేదు. ఏదో పోగొట్టుకున్నట్లుగా వుంది. మాతాజీ మిమ్మల్ని గురించే ఎప్పుడూ అనుకుంటుంది. రాంచందర్‌కు కూడా ఉత్తరం వ్రాస్తున్నాను. సెలవులు

అద్దెకిచ్చిన హృదయం

అయిపోగానే త్వరగా బయలుదేరి వచ్చేసెయ్యండి—లేకపోతే చదువు పాడవుతుంది—మీ వాళ్లకు నా అభివందనలు'

ఆ ఉత్తరం చూడగానే—ఆయవఆకారం జ్ఞాపకానికివచ్చి నవ్వువచ్చింది కానీ—ఎందుకనో వెనువెంటనే జాలికూడా వేసింది. మమ్మల్నిద్దర్నీ ఎంతగా అభిమానిస్తున్నదీ అర్థమయింది—హాస్యంకోసం—ఏదో సరదాని మేము ఆయనతోచెప్పిన అబద్ధాలు—ఆడిన నాటకాలు జ్ఞాపకంవచ్చి కొంచెం సిగ్గేసింకూడా.

శెలవు లయిపోగానే రాంచందర్ నేనూ—సిటీ కొచ్చేసాం మమ్మల్నిద్దర్నీ గభే దంపతులు ఎంతో అప్యాయంగా ఆహ్వానించారు. గభేకు కండ్లలో నీళ్లు నిండుకున్నాయి. దవడలను చప్పరించుకుంటూ—ఆయనకంటే ఎంతో ఎత్తుగా వున్న మా యిద్దరి చేతులూ పట్టుకొని మధ్యలో నిల్చున్నాడు.

నా వైపు తిరిగి 'రాంచందర్ మీరు లేకపోతే నాకేం తోచలేదు—' అన్నాడు. అప్పు డర్థమయింది నాకు ఉత్తరంలో నా పేరు సక్రమంగా వ్రాయటానికి కారణం మేమిచ్చిన అడ్రసులని!

మాకోసం మాతాజీ బాయిలర్‌లో వేడినీళ్లుంచింది. స్నానాలయిన తరువాత చిక్కని టీ తీసుకొనివచ్చి యిచ్చింది.

ఆ యింట్లో మళ్లీ మేమిద్దరం తిరుగాడుతుంటే గభే అర్ధనిమీలిత నేత్రుడై వాలు కుర్చీలో హాయిగ పడుకున్నాడు. మాతాజీ కండ్లలో కాంతి నింపుకొని ఆ రాత్రి మమ్మల్నిద్దర్నీ భోజనం అక్కడే చేయమని సంజ్ఞలద్వారా చెప్పసాగింది. మేమిద్దరం ఆ యింట్లోని సభ్యులుగా మారిపోయాం. ఏ అడ్డంకూ లేకుండా కాలం గడిచిపోతున్నది. కానీ మా చదువే కుంటుబడసాగింది.

పరీక్షలు యింకా రెండునెలలున్నాయనగా మాకు చదువును గురించిన భయం పట్టుకోసాగింది. దీక్షగా చదవటానికి రెండుమూడుసార్లు ప్రయత్నించాం కానీ ఆ గదిలోని వాతావరణం చదువుకు అనుకూలంగా లేనట్లు ఎందుకనో మా యిద్దరికీ అన్పించసాగింది. పుస్తకం పట్టుకోగానే ఎంతవద్దనుకున్నా యిద్దరికి నిద్రవచ్చేసేది. ఆ వీధిలో ఎవరూ మిత్రులు లేకపోవటంవల్ల రాత్రిళ్లు ఉత్సాహంగా చదువుకోడానికి తగిన వాతావరణం లేనట్లుగా ఏదో కొరతగా వున్నట్లుగా మాలో బలమైన అభిప్రాయం ఏర్పడసాగింది. రాత్రిళ్లు బయటకువెళ్లి టీ త్రాగివద్దామన్నా గభే దంపతులు ఆరోగ్యం పాడవుతుందని నిషేధించేవారు. వాళ్లమాట అంతగా పట్టించుకోవాలని లేకపోయినా ఎందుకనో వాళ్లిద్దర్నీ నొప్పించకుండా వుండడానికి మేము అలవాటు పడ్డాం.

అనుకోకుండా రెండుమూడు వీధులవతలున్న మా స్నేహితుడొకడు ఒకరోజు ఆదరా బాదరావచ్చి మమ్మల్నిద్దర్నీ ఏదో మంచి గది ఖాళీ అయిందనీ ప్రక్కగదుల్లో అందరూ విద్యార్థులే ఉండటంవల్ల చదువు సక్రమంగా సాగుతుందనీ హాస్టలు ఆ గదికి చాలా దగ్గరనీ అన్నివిధాలా అనువుగా వుంటుందనీ అనేక విధాలుగా మమ్మల్నిద్దర్నీ ఊరించి గదిని చూడటానికి తీసుకెళ్లాడు.

ఆ గది నిజంగా చాలా బాగుంది. ముఖ్యంగా గదిలోకి గాలి ధారాళంగా వస్తుంది. ఎండాకాలం ప్రవేశించింది కాబట్టి బయట కూర్చొని చదువుకోటానికి వీలుగా బాల్కనీ వుంది. ఆ మేడమీద అన్ని గదుల్లోనూ విద్యార్థులే వుండటంచేత 'చిన్న హాస్టల్' లా వుంది. చదువు సక్రమంగా ఆ గదిలో సాగుతుందని ఆ పరిసరాలను చూస్తే ధైర్యం వచ్చింది. అద్దెకూడా మేము అనుకున్న దానికంటే ఎక్కువేంకాదు. మేడమీద ఆ గదిని చూడగానే మేము వుంటున్న గభే యింటిలోని గది ఎంత తీసికట్టో అర్థమయింది. గభే దంపతుల ఆదరణ మినహాయించి చాలా అసౌకర్యాలు ఆ గదిలో వున్నట్లుగా మా స్నేహితులు చూపించసాగారు. గభే యింటిలోని వెనుక భాగంలోవుంది కాబట్టి యింటిచుట్టూ తిరిగిపోవాలనీ గదిలో ఒక ప్రక్కగా గోడ పగిలిందనీ స్నేహితులకు చాలా దూరంగా వుండటంచేత పరీక్ష ముందురాత్రి వెలువడే 'గెస్ పేపర్లు' మాకు అందించటం కష్టమనీ యిలా

(83వ పేజీ చూడండి)

అద్దెకిచ్చిన హృదయం

(8-వ పేజీ తరువాయి)

అప్పటిదాకా మా దృష్టికిరాని చాలా లోపాలు కనిపించసాగాయి. మాకు కూడా విసుగనిపించింది. ఈ గది ముందు గుప్తే యింటిలోని గదిని పోల్చిచూస్తే అసలు యిన్నిరోజులు ఆ గదిలో ఎట్లా నివసించామో అర్థం కాలేదు.

గదిని చూడటానికి వెళ్ళిన మేము — అడ్వాన్సుగూడా యిచ్చేటట్లు చేసాయి — మా నిర్ణయాలు.

తిరిగి గుప్తే యింటికి వచ్చాం. ఆయన యింటిముందు వాలుకుర్చీలో కూర్చొని ఎటో చూస్తూ వున్నాడు. మమ్మల్ని చూస్తూనే ఆప్యాయంగా లేచి — 'ఎక్కడికి వెళ్ళారు — యింత పొద్దునే?' అన్నాడు

మాకు ఆయన అవసరం లేకపోవచ్చు ఆయనకు మా అవసరం ఎంతగా వుందో అర్థమయింది. గర్వంగా ఫీలవుతూ యిద్దరం ఆయన — ఎదురుగా కూర్చొని — ఏవో కుంటిసాకు చెప్పి — యితర విషయాలమీదికి ఆయన దృష్టిని మళ్ళించాము.

మాతాజీ టీ యివ్వటానికి ప్రత్యక్షమయింది.

గుప్తే దంపతుల ఆదరణను తప్పించుకొని — ఎలా యీ గదివదిలి వెళ్ళాలో మాకు అర్థమవలేదు —

'మా స్నేహితులు వుండే యింట్లో ఏదో గది ఖాళీగా యుందట. మమ్మల్ని అక్కడకు రమ్మన్నారు' అన్నాను నేను చిన్నగా అసలు విషయాన్ని బయట పెట్టటానికి ఉపక్రమిస్తూ.

ఆయన ఉలిక్కిపడ్డాడు 'రాంచందర్! అదేమిటి. ఇక్కడ ఏమైనా అసౌకర్యంగా వుందా? అద్దె ఎక్కువనిపిస్తే — మీ యిష్టం వచ్చినంతే యివ్వండి. నా పిల్లల్లాంటి వాళ్ళు మీరు' — అన్నాడు. మేము ఆయన్ని వదిలి వెళ్తామనే భావనే — ఆయనకు సరిపోనట్లుంది, ముఖం అంతా అదోలాదిరిగా మారిపోయింది, కండ్లు చిట్లించి నుదురు బాదుకోసాగాడు.

మా యిద్దరికీ మాటలు కరువయ్యాయి. ఈ గది వదిలి యింకో గదికి వెళ్తామంటే — ఆయనకు మరింత బాధాకరంగా మారుతుందని ఊహించి — నేను సంభాషణను త్రుంచివేస్తూ 'ఏమీ లేదూ — బాబాజీ — మిత్రులెవరో సరదాగా అంటే మాత్రం మేము మిమ్మల్ని వదిలి పెట్టి వెళ్తామా?' అన్నాను.

ఆయన ముఖంలోని ముడుతలు తొలగిపోయాయి — చిన్నపిల్లాడిలా హుషారుగా మాతాజీ దగ్గరకువెళ్ళి ఏదోచెప్పి — బోసిగా నవ్వసాగడు

ఆమెగూడా ఏదో పెద్దగా అంటూ మా దగ్గరకు వచ్చి — అనేకరకాలుగా ఆమె భావాలను వ్యక్తపర్చింది. భాష — భావాలను వ్యక్తపర్చటానికి ఎంత అనవసరమో అప్పుడు మాకు అర్థమయింది. 'యిక్కడ ఏమైనా అసౌకర్యాలు వుంటే చెప్పమని — అద్దె ఎంతయిచ్చినా పర్వాలేదని — మేము యిద్దరం ఆమె బిడ్డల్లాంటి వాళ్ళమని' ఆమె చెప్పదల్చుకున్న విషయాలు.

వాళ్ళిద్దరి ప్రేమపాశాన్ని విదిలించుకొని గది వదలటానికి మనసొప్పలేదు —

అలాగే రెండుమూడురోజులు కృతనిశ్చయంతో అక్కడేవుండి చదువుకుందామని ప్రయత్నించాము. రాత్రి కాగానే — గాలి ఆడక యిబ్బందిగా వుండేది — దోమలు విపరీతంగా దండెత్తేవి

కుర్చీలు బయట వేసుకోటానికి స్థలం వుండేదికాదు. నిద్ర అపరిమితంగా ముంచుకొచ్చేది. మేము అద్దెకు మాట్లాడి వుంచినగది పదే పదే జ్ఞాపకంవచ్చి చదువు సాగేదికాదు. స్నేహితులు అప్పుడప్పుడూ కనబడి మమ్మల్ని తెలివితక్కువ వెధవల క్రింద జమకట్టి మాట్లాడుతుండేవారు. రాత్రి టీ త్రాగటానికి హోటలుకు వెళ్ళినప్పుడు ఎంతమంది స్నేహితులు కన్పడతారో ఎన్ని ముఖ్యమైన ప్రశ్నలను గురించి మాట్లాడుకున్నారో రాత్రిళ్ళు ఎంతసేపటిదాకా మేలుకొని చదువుకున్నారో చెప్తుంటే మా పరిస్థితి మరింత దిగజారేది.

గుప్తే గదిలో వుంటే యీ యేడు క్లాసు రాకుండా పోవటం ఖాయమని వాళ్ళు హెచ్చరిక యివ్వసాగారు. మానసికంగా ఆగదిలో వుండి చదువుకోటానికి మేము వ్యతిరేకులుగా మారిపోయాం. ఏదో విధంగా ఆ గది ఖాళీచేసి క్రొత్తగా చూసిన గదిలోకి వెళ్ళిపోవాలని నిశ్చయించుకున్నాం!

కానీ గుప్తే దంపతులను కష్టపెట్టకుండా బయటకు వెళ్ళాలని తాపత్రయం! పాపం ఆ ముసలాయన మేమున్న యీ కొద్ది కాలంలోనే గాఢమైన అనుబంధాన్ని పెంచుకొన్నాడు. దాన్ని త్రెంచివేయటానికి మాకు చేతులు రాలేదు!

వాళ్ళ మనసు నొప్పించకుండా బయటికి వెళ్ళటానికి యిద్దరం కల్సి ఒక పథకం వేసాం.

ఒక రోజు గదిలోకి పిల్చి 'బాబాజీ మమ్మల్ని ఆశీర్వదించండి ఎందుకో చెప్పాలి?' అన్నాం యిద్దరమూ.

ఆయన ఆశ్చర్యపోతూ 'ఏమిటి?' అంటూ కండ్లు మూసుకొని ఏవో గొణిగాడు ఆశీర్వాదానికి సూచనగా.

నేను చెప్పాను

'బాబాజీ — మొదటి సంవత్సరం వచ్చిన మార్కులనుబట్టి మా యిద్దరికీ స్కాలర్‌షిప్ యిచ్చారు'

ఆయన గబగబా వెళ్ళి మాతాజీని పిల్చుకొని వచ్చాడు. తన పెదవులు దవడలను కదిలించసాగాయి. దవడల చప్పరింత ఆయన ఆనందానికి సూచన.

'అంతేకాదు బాబాజీ — ర్యాంక్ విద్యార్థులము కాబట్టి స్కాలర్‌షిప్ యివ్వటమే గాకుండా ఈ రెండు నెలలూ — హాస్టల్‌లో మాకు ఉచిత భోజనం వసతి ఏర్పాటు చేసారు'

రాంచందర్ అందుకున్నాడు.

ఆయన మొహం కళ తప్పింది —

'అంటే మీరు యిక్కడే వుండటానికి వీలు లేదన్నమాట' అన్నాడు.

'వేరేచోట వుంటే స్కాలర్‌షిప్ ఇవ్వరు బాబాజీ, ఈ స్కాలర్‌షిప్ దొరకటం చాలా కష్టం. ఇవాళే ప్రొఫెసర్ను

అద్దెకిచ్చిన హృదయం

మాకు సహాయం చేయమని మీరు కోరారు కాబట్టి— ఇది గ్రాంటు అయిందనుకుంటాం.'

'అయినా ఏం ఫర్వాలేదు. ప్రతిరోజూ మేమువచ్చి మీ యిద్దర్నీ చూసిపోతుంటాం. మిమ్మల్ని చూడకుండా – మేముమాత్రం ఉండగలమా ?' అన్నాము యిద్దరమూ—

గఫే దంపతులకు మమ్మల్ని వదిలిపెట్టటం కష్టమయింది. కానీ మేము చెప్పిన కారణం చాలా బలమైంది కావటం వల్ల— మమ్మల్నిద్దర్నీ అక్కడ్నే వుండమని బలవంతం చేయటానికి అవకాశం లేకపోయింది.

గఫే ఆ పూటల్లా కాలుగాలిన పిల్లిలా తిరగసాగాడు. మాతాజీ కండ్లలో కాంతి తరిగింది. ఆ సాయంత్రం మేము బయలుదేరుతుంటే గఫే మా యిద్దరి చేతులూ పట్టుకొని మధ్యలో నిలబడి 'మిమ్మల్ని వదిలి ఎలా వుండగలము?' అన్నాడు.

ఆయన పరిస్థితి చూడగానే — చదువు సాగకపోయినా ఫర్వాలేదు. అక్కడ్నే వుండిపోదామా అని అన్పించింది.

చివరకు అతి కష్టంమీద మమ్మల్ని వదిలారు గఫే దంపతులు. ప్రతిరోజూ తప్పక వాళ్ళింటికి రావాలనీ — మరీ మరీ చెప్పారు. మాతాజీ తినుబండారాలన్నీ టిఫిన్‌లో పెట్టి మమ్మల్ని హాస్టల్‌లో తినమని యిచ్చింది. గఫే వీధి చివరివరకూ వచ్చి సాగనంపాడు. ఆయన పూర్తిగా కదిలిపోయాడు. బలహీనమైన ఆయన చేయిని అటూ యిటూ వూపుతూ — కండ్లు తుడుచుకుంటూ—మారిక్షా కనుమరుగయ్యేంత వరకూ అలాగే నిలబడిపోయాడు.

కొత్తగదిలో చేరింతరువాత— పరీక్షల భయంవల్లనో—ప్రక్క విద్యార్థుల శ్రమను చూసి కించపడటం వల్లనో—మొత్తానికి మా చదువు బాగానే సాగుతుండేది—ప్రతి రోజూ సాయంత్రం గఫే దంపతులను చూడటానికి వెళ్ళి వస్తుండేవాళ్ళం — మమ్మల్ని చూడగానే ఆయనకండ్లు మిలమిలా మెరుస్తుండేవి. మాతాజీ టీతో ఆప్యాయతనూ రంగరించి యిచ్చేది. గఫే—ప్రొఫెసర్‌ని మళ్ళీ కల్సుకున్నప్పుడు మమ్మల్నిగురించి మెచ్చుకున్నసంగతి అన్నీ చెప్తుండేవాడు.

ఆ సైకాలజీ ప్రొఫెసర్ — అనుకోకుండా మాకు అన్నివిధాల సహాయం చేస్తున్నందుకు మనసులోనే కృతజ్ఞత అర్పించుకున్నాం—

ఇలా కొన్ని రోజు లయింతరువాత చదువుగొడవలో మేము పూర్తిగా పడిపోయి గఫే యింటికి పదిరోజులయినా వెళ్ళలేకపోయాం.

ఒకరోజు సాయంత్రం మా కొత్తగది బాల్కనీలో కూర్చొని—మేము యిద్దరం చదువుకుంటుండగా—మా హాస్టల్ స్నేహితుడు మోహన్ గబగబా మా దగ్గరకు వచ్చి.

'ఒరే మీ గఫే వచ్చాడ్రా !'—అన్నాడు.

ఉలిక్కిపడి లేచి నిల్చున్నాం— 'ఏడీ— ఏడీ ?' అంటూ—

'ఇక్కడకు కాదు హాస్టల్‌కు! సరాసరి వార్డెన్ దగ్గరకువెళ్ళి మిమ్మల్ని గురించి చెప్పి మీ గదినెంబరు చెప్పమన్నాడు. ఆయన ఆ పేరుగల వ్యక్తులెవరూలేరు పొమ్మన్నా ఎంతకూ వినలేదు. మీ కేదో స్కాలర్‌షిప్ వచ్చిందనీ ప్రత్యేకంగా హాస్టలులో మిమ్మల్ని యూనివర్శిటీ ఉంచిందని — ఏమిటేమిటో చెప్తూ — చాలాసేపు ఆయనతో వాదం వేసుకున్నాడు. చివరకు వార్డెను మీక్లాసుమేటు కృష్ణమూర్తిని పిలిచి అడిగితే — 'మిమ్మల్ని మోసం చేసారు — మీ గదిని వదిలిపెట్టటానికి వాళ్ళి ప్లాన్‌వేసారు దర్జాగా—ఓ మేడమీద గదిలో వుంటున్నారు—చూపిస్తారండి'.— అని తీసుకొని వస్తున్నాడు. నాకీ సంగతంతా తెల్సుకాబట్టి — ముందుగా మీకు చెబ్దామని సైకిలేసుకొని వచ్చాను' అని మోహన్ ముగించాడు.

మా కిద్దరికీ కాళ్ళు ఆడలేదు. గఫేకి ఎలా ముఖం చూపించాల్నో అర్థంగాలేదు. నేరం చేసినవారిలా — కంగారు పడసాగాం. గఫేనుంచి తప్పించుకోటానికి — ఆ గదిని వదిలి బయటికి వెళ్దామని సిద్ధపడుతుండగానే—క్రిష్ణమూర్తితో సహా—గఫే మా మేడపైకి వచ్చేసాడు.

మే మిద్దరమూ తలలు వంచుకొని నిలబడ్డాం.

మా యిద్దరి మధ్యకూవచ్చి — చేతులు పట్టుకొని— 'మీ రెందుకిలా మీ బాబాజీకి అబద్ధం చెప్పారు' అన్నాడు.

మా కండ్లలో నీళ్ళు తిరిగాయి. ఆయనముఖం చూడటానికి మా యిద్దరికీ ధైర్యం చాలలేదు.

'ఎంతమంచి పిల్లలను కున్నాను — ఎంతగా మోసం చేసారు'— ఆయనగొంతు బొంగురుపోయింది.

మాకేం చెప్పాల్నో అర్థంకాలేదు. నిశ్శబ్ద దేవత ఆ గదిలో భయంకరంగా నాట్యమాడింది.

కాసేపాగిన తరువాత — నెమ్మదిగా ఆయన మా చేతులను వదిలిపెట్టి — బరువుగా మేడమెట్లు దిగాడు.

ఇద్దరం ఆయన వెనకాలే నడిచాము. కానీ ఆయన మళ్ళీ మా వైపు తిరిగికూడా చూడలేదు

రెండురోజుల తర్వాత—మాతాజీ సహాయంతో గఫేకు అన్ని విషయాలూ సవివరంగా చెప్పి — నచ్చచెప్పే ప్రయత్నంతో ఆయన యింటివైపు వెళ్ళాం.

ఆయన యింటిముందు ఇద్దరు ముగ్గురు కొత్తవ్యక్తులు కనపడ్డారు.

ఎవరో బ్యాగుతో — ఇంటిలోపలినుండి వచ్చి రిక్షాఎక్కి మా ముందునుంచే వెళ్ళిపోయాడు.

మాకు ఇంట్లోకి వెళ్ళటానికి ధైర్యం చాలలేదు—

బయట నిల్చొని తచ్చాడుతుండగా లోపలనుంచి సైకాలజీ ప్రొఫెసర్ బయటకు వచ్చాడు.

ఆత్రంగా ఆయన వద్దకువెళ్ళి — 'ఏమయింది?' అని యిద్దరం ఏకకంఠంతో ప్రశ్నించాం.

'గఫేకి మళ్ళీ ఆ షాపిష్టి జబ్బు తిరగబెట్టింది' — అంటూ చర చరా వెళ్ళిపోయాడు.

పాలిపోయిన మొఖాలతో యిద్దరం—ఒకరినొకరు చూసుకున్నాం.

తలలు వంచుకొని తప్పుచేసిన వాళ్ళలా ఇద్దరం— వెనక్కు తిరిగాం !